## క్లుప్తంగా

### ఎన్నికల కసరత్తుపై చర్చ



జనరల్ అబ్జర్వర్ కైలాశ్ వాంఖడేకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న శ్రీనివాసులు

**చిత్తూరు కలెక్టరేట్:** జిల్లాకు విచ్చేసిన జనరల్ అబ్జర్వర్ (నగరి, జీడీ నెల్లూరు అసెంబ్లీ నియోజకవర్గాలు) కైలాశ్ వాంఖడేను చిత్తూరు అసెంబ్లీ ఆర్‌ఓ శ్రీనివాసులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఆదివారం ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో జనరల్ అబ్జర్వర్‌ను కలిశారు. అనంతరం కాసేపు చిత్తూరు అసెంబ్లీ పరిధిలోని ఎన్నికల కసరత్తుపై చర్చించారు. కార్యక్రమంలో పూతలపట్టు అసెంబ్లీ ఆర్‌ఓ చిన్నయ్య పాల్గొన్నారు.

### కాణిపాకంలో భక్తుల రద్దీ

**కాణిపాకం:** కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామి ఆలయం ఆదివారం భక్తులతో కిక్కిరిసింది. వేసవి సెలవులు కావడంతో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పోటెత్తారు. వేకువ జాము నుంచే ఆలయంలో పూజలు ప్రారంభం కాగా భక్తులు కిటకిటలాడారు. ఎండను సైతం లెక్కచేయకుండా స్వామి దర్శన కోసం భారీగా క్యూకట్టారు. ఆలయ అధికారులు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా దర్శనభాగ్యం కల్పించారు.

### భగవద్గీతపై ప్రచారం



ప్రచారంలో త్రైత సిద్ధాంత కమిటీ సభ్యులు

**గుడుపల్లి:** మండలంలోని బండశెట్టిపల్లె, గోకర్లపల్లె గ్రామాలలో త్రైత సిద్ధాంత భగవద్గీతపై ఆదివారం ప్రభోద సేవా సమితి కమిటీ అధ్యక్షులు క్రిష్ణ ఆధ్వర్యంలో ప్రచారం చేశారు. ఆచార్య ప్రభోదానంద యోగీశ్వరులు రచించిన త్రైత సిద్ధాంత గ్రంథాల గురించి ప్రజలకు తెలియజేశారు. ఆత్మ, జీవాత్మ, పరమాత్మల గురించి, త్రైత సిద్ధాంతం గురించి వివరించారు. కార్యక్రమంలో చరణ్, క్రిష్ణప్ప, చందు, పురుషోత్తం, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

### గరుడ సేవను వైభవంగా జరిపించండి

**నగరి:** పట్టణ పరిధిలో టీటీడీ ఆధీనంలో ఉన్న శ్రీకరియమాణిక్య స్వామి ఆలయంలో కంచి గరుడసేవ ఉత్సవాన్ని వైభవంగా జరిపించాలని ఆలయ సేవాసభ్యులు స్థానిక ఆలయ అధికారి వెంకటరమణకు ఆదివారం వినతి పత్రం సమర్పించారు. మే 23వ తేదీ జరిగే ఉత్సవానికి సంబంధించిన కరపత్రాలు, గోడ పత్రికలు, ఫ్లెక్సీ బోర్డులు, విద్యుత్ దీపాలంకరణ, వారం రోజులు ముందుగా ఏర్పాటు చేయాలని కోరారు. స్వామివారి వాహనసేవ ముందు కోలాటాలు, భజన బృందాలు, సాంస్కృతిక కార్యక్రమాల ఏర్పాట్లకు సన్నాహాలు చేయాల్సిందిగా కోరారు.

### సత్యం చెప్పే 'అనితరుడు'

**పలమనేరు:** మనిషి తత్వాన్ని, జీవిత సత్యం చూపేదే మువ్వా కవిత్వమని ప్రముఖ సాహిత్య విమర్శకులు చలపతిరావు పేర్కొన్నారు. మువ్వా శ్రీనివాసరావు రచించిన అనితరుడు పుస్తకావిష్కరణ కార్యక్రమం ఆదివారం పట్టణ సమీపంలోని కళామందిరంలో జొన్నవిత్తుల శ్రీరామచంద్రమూర్తి అధ్యక్షతన నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సహజత్వానికి దగ్గరగా కళ్లముందు కనిపించే దృశ్యాలను కథావస్తువుగా స్వీకరించారని విశ్లేషించారు. అనంతరం పుస్తక రచయితను ఘనంగా సన్మానించారు. పలమనేరు బాలాజీ, పల్లిపట్టు నాగరాజు, ప్రముఖ కవులు పాల్గొన్నారు.

### పంటలపై ఏనుగుల దాడి

**పెద్దపంజాణి:** మండలంలో పంటలపై ఏనుగుల దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. కొంతకాలంగా పెద్దకాప్పల్లె పంచాయతీలోని అటవీ సరిహద్దు గ్రామాలైన తిప్పిరెడ్డిపల్లె, కొత్తబూరగపల్లె, పెనుగొలకల, ముదిరెడ్డిపల్లె, పెద్దకాప్పల్లె, ఆకులవారిపల్లె, జిట్టంవారిపల్లె, గౌరీనగర్ రైతుల పంటలను నాశనం చేస్తున్నాయి. శనివారం రాత్రి కీలపట్ల ఫారెస్ట్ బీట్ నుంచి వచ్చిన ఏనుగులు ముదిరెడ్డిపల్లె రైతుల పంటలకు నష్టం కలిగించాయి. ఆదివారం ఉదయం ఇది వెలుగులోకి వచ్చింది. యాభైవేల రూపాయల పంట నష్టపోయినట్లు బాధిత రైతులు టీజీ సుబ్రమణ్యం, నాగరాజు ఆవేదన వ్యక్తం చేశారు. ఏనుగుల దాడుల్లో దెబ్బతిన్న మామిడి, ఇతర పంటలను రాయలపేట ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ రవికుమార్ పరిశీలించారు. వివరాలను ఉన్నతాధికారులకు పంపి నష్ట పరిహారం మంజూరుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.



ఏనుగులు విరిచేసిన మామిడి చెట్లను చూపుతున్న రైతు

---







గుడిపాల: వసంతాపురంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, గుడిపాల: మరకాలకుప్పంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, తేనబండలో మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు లీనారెడ్డి ప్రచారం

# బాబుకు ఓటేస్తే పింఛన్ కోసం ▶ క్యూలో నిలబడాలి

- జగనన్న వస్తే పింఛన్‌తోపాటు పథకాలన్నీ ఇంటికే వస్తాయి
- చిత్తూరు వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి విజయానందరెడ్డి

**గుడిపాల:** చంద్రబాబు మాయమాటలను నమ్మి ఓట్లేస్తే పింఛన్ కోసం క్యూలో నిలబడాల్సి వస్తుందని, జగనన్న వస్తే పింఛన్‌తోపాటు సంక్షేమ పథకాలన్నీ ఇంటికే వస్తాయని చిత్తూరు వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి విజయానందరెడ్డి అన్నారు. మండలంలోని బసవాపల్లె పంచాయతీలో ఆదివారం స్థానిక సర్పంచ్ సుధాకర్‌నాయుడి అధ్యక్షతన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇందులో విజయానందరెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు అధికారంలోకి రావడానికి సూపర్‌సిక్స్ అనే పేరుతో మాయమాటలు చెబుతున్నారన్నారు. టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బెంగళూరులో ఉంటాడని, టీడీపీ ఎంపీ అభ్యర్థి బాపట్లలో ఉంటాడని నగరవాసులకు ఎవరూ అందుబాటులో ఉండరని చెప్పారు. ఎలాంటి సమస్యలు వచ్చినా తాను మాత్రమే అందుబాటులో ఉంటానని స్పష్టం చేశారు. కావున ప్రతి ఒక్కరూ ఆలోచించి ఫ్యాన్ గుర్తుకు ఓటువేయాలన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తన పాలన బాగుంటేనే ఓటేయండి అని అడుగుతున్నారని, దేశ చరిత్రలో ఇలా ఏ నాయకుడూ ఇప్పటికి అడగలేదన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీవైస్ చైర్మన్ రమ్య, ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు జనార్దన్, సింగిల్‌విండో అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, సర్పంచులు మధుసూదన్‌రెడ్డి, రజినీకాంత్, మధుసూదన్‌రాయల్, రమేష్, విక్టర్, మోహన్, ప్రసాద్, ప్రవీణ్, ఎంపీటీసీలు డానియల్, యోవాన్, వైఎస్సార్‌సీపీ నాయకులు శివాజీరాయల్, గాబ్రియేల్, విజయ్, వెంకటేష్‌రెడ్డి, బాలాజీ, కారిమేఘన్, ప్రకాష్, సైమాన్, డెవిడ్, శిలంబరసన్, సాయిక్రిష్ణ, గుండుసాయితో పాటు కార్యకర్తలు అధికసంఖ్యలో పాల్గొన్నారు.



గుడిపాల: ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న విజయానందరెడ్డి

#### రామ్‌నగర్‌కాలనీలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ల ప్రచారం

**చిత్తూరు కార్పొరేషన్:** నగరంలోని పలు ప్రాంతాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు ఆదివారం ప్రచారం నిర్వహించారు. ఫ్యాన్ గుర్తుకు రెండు ఓట్లు వేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. స్థానిక రామ్‌నగర్ కాలనీలో వైఎస్సార్‌సీపీ నగర యువత అధ్యక్షుడు డీసీ మనోజ్‌రెడ్డి ఆధ్వర్యంలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు అందజేశారు. నగరానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు బెంగళూరు, చెన్నై నగరాల్లో పనిచేస్తూ, వారాంతంలో వైఎస్సార్‌సీపీ గెలుపుకోసం ప్రచారం నిర్వహిస్తున్నారు. గడపగడపకు వెళ్లి జగనన్న పాలనలో జరిగిన మేలును తెలియజేశారు. దేశంలోనే ఇటువంటి పాలన ఎక్కడ లేదని కొనియాడారు. చంద్రబాబు పాలనలో ఇంత మేలు ఎందుకు జరగలేదో ఆలోచించాలని చెప్పారు. అమలుకానీ హామీలు ఇవ్వడం అధికారంలో వచ్చాక అహంకార మాటలు చెప్పడం టీడీపీ నాయకులకు అలవాటు అన్నారు. కార్యక్రమంలో రాజేష్ రెడ్డి, రెడ్డిసాయి, వినయ్, వివేక్, భాను, కిరణ్, శబరీష్, అఖిలేష్‌రెడ్డి, హరిసాయి, మంగ తదితరులు పాల్గొన్నారు. వన్నియర్‌బ్లాక్ డివిజన్‌లో కార్పొరేటర్ శశికుమార్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు ప్రచారం చేశారు. ఎన్నికలో అందరూ ఫ్యాన్ గుర్తుకు ఓటువేసి గెలిపించాలని కోరారు. తేనబండలో పార్టీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు లీనారెడ్డి, మురకంబట్టులో కార్పొరేటర్ నవీన్ కుమార్, నరిగపల్లెలో కార్పొరేటర్ మధురెడ్డి, నాయకులు కిషోర్, గంగకాలనీలో నాయకులు నరేష్, జానకరపల్లెలో నాయకులు రాజశేఖర్, గంగనపల్లెలో నాయకులు రమణ ప్రచారం చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న చిత్తూరు ఎమ్మెల్యే అభ్యర్థి విజయానందరెడ్డి

### యాదవుల మద్దతు వైఎస్సార్‌సీపీకే

**చిత్తూరు కార్పొరేషన్:** యాదవుల మద్దతు వైఎస్సార్‌సీపీకే అని అఖిల భారతీయ యాదవ సంఘం నాయకులు తెలిపారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆదివారం ఆ సంఘం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. 1994లో సంఘం పేరిట స్థలం కొనుగోలు చేశామన్నారు. దానికి 1బీ త్వరగా రావడానికి విజయానందరెడ్డి సహకారం అందించారని గుర్తుచేశారు. ఇన్ని సంవత్సరాల్లో టీడీపీ ఏం చేయకపోయినా యాదవులు మద్దతు ఇచ్చారని, ఈ సారైనా మనకు సాయం చేస్తున్నవారిని ఎన్నుకుందామని పిలుపునిచ్చారు. కొందరు స్థానికంగా టీడీపీ వైపు వెళ్లినంత మాత్రాన అందరూ వెళ్లినట్లు కాదని చెప్పారు. యాదవుల మద్దతు ఇవ్వడం ఆనందంగా ఉందని వైఎస్సార్‌సీపీ చిత్తూరు ఎమ్మెల్యే అభ్యర్థి విజయానందరెడ్డి తెలిపారు. రాజకీయంగా బీసీలకు దేశంలో ప్రాధాన్యత ఉందన్నారు. పలు రాష్ట్రాల్లో యాదవ్‌లు ప్రజాప్రతినిధులుగా ఉన్నరన్నారు. మన రాష్ట్రంలో బీసీ సామాజిక వర్గం పరంగా రాజ్యసభసభ్యుడిగా బీదమస్తాన్‌రావ్, ఎమ్మెల్సీగా రమేష్‌రావుకు, మంత్రిగా అనిల్‌కుమార్‌యాదవ్‌కు జగనన్న అవకాశం ఇచ్చినట్లు గుర్తుచేశారు. పార్టీకి బీసీలు వెన్నముక లాంటివరన్నారు. అధికారంలో వచ్చాక వారికి సముచిత స్థానం ఇస్తామన్నారు. రానున్న నగరపాలక, పంచాయతీ, మండల ఎన్నికల్లో వారికి ప్రాధాన్యతనిస్తామని హామీనిచ్చారు. కార్యక్రమంలో నాయకులు నవీన్‌యాదవ్, కోదండన్ యాదవ్, సురేష్ యాదవ్, దొరస్వామి యాదవ్, లోకయాదవ్, రెడ్డప్ప యాదవ్, బాబుయాదవ్, సర్పంచ్‌లు రవియాదవ్, వాసుయాదవ్ పాల్గొన్నారు.



నరిగపల్లెలో కార్పొరేటర్ మధురెడ్డి ప్రచారం



గంగకాలనీలో నాయకులు నరేష్ ప్రచారం



జానకారపల్లెలో నాయకులు రాజశేఖర్ ప్రచారం



గుడిపాల: ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న విజయానందరెడ్డి

## మూడు దశాబ్దాల అపూర్వ కలయిక

**పెనుమూరు(కార్వేటినగరం):** పెనుమూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1991–92లో టెన్త్ చదివిన విద్యార్థుల అపూర్వ సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. పర్యాటక కేంద్రమైన పులిగుండు టూరిజం శాఖ వసతిగృహంలో జరిగిన ఈ కార్యక్రమానికి 90 మంది పూర్వ విద్యార్థులు హాజరయ్యారు. 32 సంవత్సరాల తర్వాత పూర్వ విద్యార్థులు ఒకే వేదికపై కుటుంబ సభ్యులతో ఉత్సాహంగా హాజరు కావడంతో వారి ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. ముందుగా ఒకరినొకరు పరిచయం చేసుకుంటూ యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. మూడు దశాబ్దాల తర్వాత ఇలా ఒక్కటి కావడానికి పూర్వ విద్యార్థులు దూది నిరంజన్, కారేటి జ్యోతీశ్వరరెడ్డి, తోకల జ్ఞానకిశోర్, మహ్మద్ రఫీ, జి.వినాయక, కె.కేశవులు ఎంతో కృషి చేసినట్లు చెప్పారు. త్వరలో ఓ ట్రస్ట్ ఏర్పాటు చేసి మొదట తమ పూర్వ విద్యార్థుల్లో వెనకబడిన వారిని ఆర్థికంగా ఆదుకుంటామని తెలిపారు. తర్వాత మండలంలోని పేద విద్యార్థుల చదువుకు ట్రస్ట్ ఆర్థిక సహాయం అందిస్తుందని చెప్పారు.



1991- 92 బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు

## చిరుతపులులంటూ తప్పుడు సమాచారం

**గుడిపాల:** చిరుతపులి, పిల్లలు మూడు ఉన్నాయంటూ వాట్సాప్, సోషల్ మీడియా గ్రూపుల్లో రావడంతో ఆదివారం మండలంలోని కనకనేరి అటవీప్రాంతంలో చిత్తూరు ఈస్ట్‌రేంజ్ ఆఫీసర్ థామస్ ఆధ్వర్యంలో అటవీ ప్రాంతాన్ని గాలించారు. ఎక్కడా చిరుత పులులు లేవని నిర్ధారించారు. ఈ వీడియో మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని బాల్కట్ అటవీ ప్రాంతానికి సంబంధించిందని నిర్ధారించారు. సోషల్ మీడియాలో వైరల్ చేసిన ముగ్గురిని అదుపులోకి తీసుకున్నట్లు ఆయన తెలియజేశారు. ఆయనతోపాటు డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ కరణ్‌సింగ్, బీట్ ఆఫీసర్లు ప్రభాకర్‌రెడ్డి, మధుతోపాటు సిబ్బంది పాల్గొన్నారు.



అటవీప్రాంతాన్ని పరిశీలిస్తున్న అధికారులు

# పల్లె పల్లెకూ చేరిన ప్రభుత్వ వైద్యం!

- గతంలో వైద్య సేవలకు అవస్థలు
- ఈ ప్రభుత్వంలో ఇంటి వద్దే వైద్యం
- వైద్య చరిత్రలో సరికొత్త ఒరవడి

**చిత్తూరు రూరల్ (కాణిపాకం):** ప్రజారోగ్యమే పరమావధిగా ప్రస్తుత ప్రభుత్వం వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టింది. వైద్య చరిత్రలో సరికొత్త ఒరవడిని తీసుకొచ్చింది. ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమం గ్రామీణ ప్రజలకు వరంలా మారింది. మండల కేంద్రాలు, పట్టణాలకు వెళ్లాల్సిన పనిలేకుండా నాణ్యమైన వైద్యం పేదింటి తలుపు తడుతోంది. గర్భిణులు, బాలింతలు, బీపీ, షుగర్, కేన్సర్ ఇతర దీర్ఘకాల వ్యాధులతో బాధపడుతున్న వారికి క్రమం తప్పకుండా వైద్యం అందిస్తూ వారి ఆరోగ్య పరిరక్షణకు దోహదపడుతోంది.

#### విలేజ్ హెల్త్ క్లినిక్‌ల పరిధిలో..

నియోజకవర్గంలో చిత్తూరు, గుడిపాల రెండు మండలాల్లోని 3 పీహెచ్‌సీల పరిధిలో 25 విలేజ్ హెల్త్‌క్లినిక్ (వీహెచ్‌సీ)ల ద్వారా ఫ్యామిలీ డాక్టర్ సేవలు అందిస్తున్నారు. రెండు సంచార వాహనాల ద్వారా రోజూ వీహెచ్‌సీల పరిధిలో వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారు. పీహెచ్‌సీలోని ఇద్దరు వైద్యుల్లో ఒకరు తమ మండలంలోని వీహెచ్‌సీలను ప్రతి నెలా క్రమం తప్పకుండా సందర్శిస్తున్నారు. వైద్యులతో కలిపి 18 మంది వైద్య నిపుణులు, వారి వెంట ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు, ఇతర ఆరోగ్య సిబ్బంది విధుల్లో పాల్గొంటున్నారు. ప్రజలకు జవాబుదారీ కోసం ఆ వీహెచ్‌సీలో ఏ తేదీన వైద్య సేవలు అందించేది నోటీసు బోర్డులు ఏర్పాటు చేస్తున్నారు. ఆ రోజు ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు వీహెచ్‌సీ వద్ద వైద్య శిబిరం ఏర్పాటు చేసి వైద్యసేవలు అందిస్తున్నారు. మధ్యాహ్నం నుంచి ఇళ్ల వద్ద మంచానికే పరిమితమైన రోగుల చెంతకు వెళ్లి చూస్తున్నారు. 14 రకాల వైద్య పరీక్షలతో పాటు 105 రకాల మందులు అందుబాటులో ఉంచి రోగికి అవసరమైన మందులు అందజేస్తున్నారు. ప్రతి నెలా రోగి పరిస్థితిని గమనిస్తూ క్రమం తప్పకుండా వైద్యం అందించడం ద్వారా ఆరోగ్యవంతమైన జీవనం సాగించేందుకు వీలు కలిగిందని ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



గుడిపాలలో ఫ్యామిలీ ఫిజిషియన్‌లో భాగంగా వైద్య సేవలు అందిస్తున్న వైద్యులు

#### మారిన రూపురేఖలు

పేదల వైద్యానికి పెద్దపీట వేసిన సీఎం జగన్ నాడు–నేడు ద్వారా ప్రభుత్వ ఆస్పత్రుల రూపురేఖలు మార్చడంతోపాటు వైద్యులు, ల్యాబ్ టెక్నీషియన్స్ ఇతర సిబ్బంది ఖాళీ పోస్టులను భర్తీ చేశారు. విలేజ్ క్లినిక్స్ ద్వారా గ్రామీణులకు నాణ్యమైన వైద్యాన్ని చేరువ చేశారు. సంపన్నుల మాదిరి పేదలకు ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని అందుబాటులోకి తెచ్చారు. గ్రామాల్లో సర్వే నిర్వహించి గర్భిణులు, బాలింతలతో పాటు బీపీ, షుగర్, టీబీ, ఎనీమా, ఓరల్ కేన్సర్, బ్రెస్ట్ కేన్సర్, సర్వేకల్ కేన్సర్ మొదలైన దీర్ఘకాల వ్యాధులతో బాధపడుతున్న వారిని గుర్తించి వారికి ప్రతినెలా క్రమం తప్పకుండా వైద్యసేవలు అందిస్తుండటం గమనార్హం.

| నెలవారీ వివరాలు... | | |
|---|---|---|
| మొత్తం ఓపీలు | : | 6, 750 |
| జీపీ | : | 2,125 |
| షుగర్ | : | 1,151 |
| గర్భిణీ సేవలు | : | 601 |
| చిన్నపిల్లల సమస్యలు | : | 915 |
| కాళ్లు, ఇతర సమస్యలు | : | 1958 |
| అందుబాటులో వైద్య పరీక్షలు | : | 14 |
| మందులు, మాత్రల రకాలు | : | 105 |

#### గతం.. అవస్థలమయం

గతంలో వైద్యం కోసం గ్రామీణ ప్రాంత ప్రజలు మండల కేంద్రాల్లోని పీహెచ్‌సీలు, పట్టణాలకు వెళ్లేందుకు తీవ్ర వ్యయ ప్రయాసలకు గురి కావాల్సి వచ్చేది. వైద్యులు, సిబ్బంది, మందుల కొరతతో అక్కడ సేవలు అంతంత మాత్రంగానే ఉండేవి. ఆర్థిక స్థోమత లేక రక్తపరీక్షలు కోసం ప్రైవేట్ ల్యాబ్‌లను ఆశ్రయించేందుకు పేదలు ఇబ్బంది పడేవారు.

#### ఆస్పత్రికి వెళ్లే పనిలేదు



ప్రతి 15 రోజులకోసారి మా ఊరికే డాక్టర్లు, ఇతర సిబ్బంది వచ్చి పరీక్షలు చేసి మందులు ఇస్తున్నారు. మంచిగా చూస్తున్నారు. మంచానికి పరిమితమైన వారి ఇంటి వద్దకే వెళ్లి చికిత్స చేస్తున్నారు. వారి బాగోగులను చూసి ఉచితంగా మందులు, మాత్రలు ఇచ్చి వెళుతున్నారు. గతంలో చిన్న జబ్బుకూ పట్టణానికి పరుగులు పెట్టాల్సి వచ్చేంది. ఇప్పుడు ఊరికి డాక్టర్ వస్తున్నారు.

– ఆనందబాబు, ఆనగల్లు, చిత్తూరు మండలం

#### విధిగా ఊరికొస్తున్నారు



నెల మొదట్లో డాక్టర్లు క్రమం తప్పకుండా ఊరికొస్తున్నారు. వాళ్లు వస్తున్నారని ముందుగానే ఆశావర్కర్లు, ఏఎన్‌ఎంలు, వలంటీర్ల ద్వారా సమాచారం ఇస్తున్నారు. పరీక్షలు చేసి తీవ్ర సమస్యలుంటే మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకుంటున్నారు. ఆరోగ్యంతో పాటు గ్రామ సమస్యలను పరిష్కరించేలా చూస్తున్నారు. క్యాంపునకు వచ్చినప్పుడల్లా తాగు నీటిని పరీక్షిస్తున్నారు.

–సుజి, ఆనగల్లు, చిత్తూరు మండలం

#### గ్రామానికొస్తున్నారు



నాకు జబ్బు పడితే ముందు ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లాల్సి వచ్చేంది. ఇప్పుడు ఊర్లోనే చూసుకుంటున్నా. రెండు వారాలకు ఒకసారి వైద్యులు మా ఇంటికే వచ్చి పరీక్షలు చేస్తున్నారు. రెండు వారాలకు సరిపడా మందులు ఇస్తున్నారు. గతంలో మేమే ఆస్పత్రుల చుట్టూ తిరిగేవాళ్లం. ఇప్పుడు ఆ అవస్థలు తప్పాయి. గడప ముంగిటకే వైద్య సేవలు అందడం ఆనందంగా ఉంది.

–రంజితమ్మ, వెంగమాంబపురం, గుడిపాల

#### ముసలివాళ్లకు మేలు



కాళ్ల నొప్పులు, ఆయాసం, బీపీతో బాధపడుతున్నా. కాళ్ల నొప్పులు ఎక్కువగా ఉండటంతో ఆస్పత్రి వరకు వెళ్లలేని పరిస్థితి. ప్రతి నెల డాక్టర్‌తో కలిసి వైఎస్సార్ హెల్త్ క్లినిక్ సిబ్బంది ఊర్లోకి వస్తున్నారు. ఇక్కడే పరీక్షలు చేసి నెలకు సరిపడా మందులు ఇస్తున్నారు. నాలాంటి ముసలి వాళ్లకు అంతకన్నా కావాల్సిందేముంది. ఈ ప్రభుత్వానికి నా దీవెనలు ఎప్పుడూ ఉంటాయి.

– చిన్నబ్బ, వెంగమాంబపురం, గుడిపాల

### అలరించిన దుర్యోధన వధ

- ముగిసిన మహాభారత ఉత్సవాలు



దుర్యోధనుడితో తలపడుతున్న భీముడి పాత్రధారి

**వెదురుకుప్పం:** మండలంలోని మొరవ గ్రామంలో ఉన్న ద్రౌపదీ సమేత ధర్మరాజుల ఆలయంలో గత 10 రోజులుగా జరుగుతున్న మహాభారత ఉత్సవాలు ఆదివారం దుర్యోధన వధతో ముగిశాయి. ఉదయం అమ్మవారికి ప్రత్యేక అభిషేక పూజలు చేశారు. తదుపరి భాగవతారిణిచే సుమతి హరకథా కాలక్షేపం జరిగింది. అనంతరం మధ్యాహ్నం దుర్యోధన వధ ఘట్టాన్ని కళాకారులు రక్తికట్టించారు. ముందుగా గంగమడుగులో దాక్కొని ఉన్న దుర్యోధనున్ని భీమసేనుడు లాక్కొచ్చి చేసే యుద్ధ సన్నివేశం ఆహుతులను అలరించింది. ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన దుర్యోధనుడి ప్రతిమ వద్ద సాగిన భీమ, దుర్యోధన వేషధారుల భీకర పోరు భక్తులను ఆకట్టుకుంది. ఇద్దరి మధ్య వీరోచితంగా సాగిన పోరులో దుర్యోధనుడు తనువు చాలించాడు. కళాకారుల ప్రదర్శన రక్తి కట్టించారు. తదుపరి ధర్మరాజుల పట్టాభిషేకం జరిగింది. సాయంత్రం అమ్మవారి అగ్నిగుండ ప్రవేశాన్ని భక్తి ప్రపత్తులతో నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాలకు చెందిన భక్తులు కంకణధారులై ఉపవాసాలతో అగ్నిగుండ ప్రవేశం చేసి మొక్కులు తీర్చుకున్నారు. మండలంలోనే మొరవ గ్రామంలో అమ్మవారి ఆలయంలో మొదటిగా సాగిన మహాభారత ఉత్సవాలు ప్రతి రోజూ అంగరంగ వైభవంగా నిర్వహించారు. విద్యుత్ దీపాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. భక్తులకు అన్నదానం చేశారు. ఉత్సవాలను నిర్వాహకులు బోడిరెడ్డి మోహన్‌రెడ్డి, తారక్ రెడ్డి పర్యవేక్షించారు.